

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్ రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : సోన్‌సబ్‌స్టేషన్ దగ్గర విద్యుత్‌లైన్లలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సోన్, మాదాపూర్, గంజాల్ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. 33/11 కేవీ ఎస్ఎస్, సోన్‌సబ్‌స్టేషన్ పరిధిలో వచ్చే గ్రామాలన్నింటికీ విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు, రైతులు విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

నేడు రాణాపూర్‌లో జాతర



అమ్మవారు

నిర్మల్‌రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాణాపూర్ గ్రామంలో ఆదివారం తుల్జాభవాని జాతర నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ వ్యవస్థాపకులు రాథోడ్ మహేందర్ మహరాజ్ శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేయాలని కోరారు.

స్థానిక ఎన్నికలపై.. వీడని ఉత్కంఠ!

స్థానిక ఎన్నికల బంతి హైకోర్టులో ఉంది. దీంతో కోర్టు తీర్పు కోసం పల్లెలు ఎదురుచూస్తున్నాయి. కొన్ని నెలలుగా ఎప్పుడెప్పుడా అని అంతా ఆసక్తిగా చూసిన స్థానిక ఎన్నికల ప్రక్రియలో కీలకమైన రిజర్వేషన్లు కోర్టు తీర్పు పై ఆధారపడడంతో అందరి చూపు 8వ తేదీ బుధవారంపై పడింది. మరోవైపు పల్లెల్లో కొత్త, పాత నాయకులు ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. పార్టీలు లెక్కలు వేసుకుంటున్నాయి. పోటీ పెరిగిపోవడంతో పల్లెల్లో జోరుగా సమీకరణాలు మొదలయ్యాయి..

- **8వ తేదీవైపు అందరి చూపు**
- **రిజర్వేషన్‌ల నిర్ణయంపైనే దృష్టి**
- **లెక్కల్లో పార్టీలు**
- **హై'కోర్టు'లో ఆశావహుల భవితవ్యం**





నిర్మల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికల రిజర్వేషన్‌లపై ఈనెల 8వ తేదీన రాష్ట్ర హైకోర్టు వెలువరించే తీర్పు ఆశావాహుల భవితవ్యాన్ని నిర్ధారించబోతోంది. ప్రస్తుతం అన్ని పార్టీల నేతలతో పాటు ఆయా బీసీ వర్గాల చూపంతా కోర్టు తీర్పు వైపే నిలుస్తోంది. ఈ నెల 8వ తేదీ న హైకోర్టు ఎలాంటి తీర్పునిస్తుందోననే అంశమే ప్రస్తుతం పల్లెల్లో హట్ టా ఫిక్ గా మారింది. ఇప్పటికే ఎంపీటీసీ, జడ్పీటీసీ సర్పంచ్ పదవులకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్ జారీ అయిన నేపథ్యంలో అన్ని పార్టీల నేతలు ఆ దిశగా సిద్ధ మవుతున్నారు. ముఖ్యంగా బీసీ వర్గానికి చెందిన నాయకులు ఈ సారి రిజర్వేషన్‌ల పెంపుతో తమ రాజకీయ భవిష్యత్‌పై రెట్టిం పు ఆశలు పెంచుకున్నారు. 42 శాతం రిజర్వేషన్‌లను బీ.సీలకు కేటాయించనుండడంతో మెజార్టీ ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ పదవులు ఈ వర్గానికి దక్కనున్నాయి. ఒకవేళ హైకోర్టు తీర్పుతో ప్రభుత్వ నిర్ణయానికి అనుకూలంగా వెలువడనట్లయితే తమ పరిస్థితి ఏమిటంటూ బీ.సీ వర్గానికి చెంది న నాయకులు ఆందోళనకు గురవుతున్నారు. దీంతో పాటు కోర్టుతీర్పు భిన్నంగా వెలువడితే స్థానిక ఎన్నికల నిర్వహణ సాధ్యం కాకపోవచ్చన్న అభిప్రాయాలు సైతం వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల కమిషన్ జారీ చేసిన షెడ్యూల్ సైతం నిలిచిపోయే అవకాశాలు ఉంటాయ ని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా కోర్టు తీర్పు ఎలా ఉన్నా రాజకీయ పార్టీల నాయకులు బీ.సీ వర్గాలకు చెందిన నేతలు మాత్రం ఎన్నికల్లో పోటీ కోసం సిద్ధమవుతుండడం ఆసక్తిని రేకెత్తిస్తోంది.

పార్టీల్లో మొదలైన సందడి...

కాగా రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ జారీ చేయడంతో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఆ దిశగా సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే అన్ని పార్టీల్లోనూ సందడి మొదలైంది. సర్పంచ్ పదవుల నుంచి మొదలుకొని ఎంపీటీసీ, జడ్పీటీసీ పదవుల వరకు పోటీకి సంబంధించిన హడావుడి నెలకొంది. పోటీకి సిద్ధమవుతున్న బీ.సీ వర్గాలకు చెందిన నేతలు తమ పార్టీ అధినేతలపై ఇప్పటికే ఒత్తిడి మొదలుపెట్టారు. ఈ సారి ఎలాగైనా తమకే టికెట్‌లు ఇవ్వాలంటూ వారు ముఖ్య నేతలపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు చెబుతున్నారు.

కాంగ్రెస్, బీజేపీల్లో జోరుగా సమీకరణలు...

కాగా కోర్టు తీర్పుతో నిమిత్తం లేకుండా ప్రస్తుతం జారీ అయిన షెడ్యూల్‌ను పరిగణలోకి తీసుకుంటూ కాంగ్రెస్, బీజేపీలో జోరుగా సమీకరణల్లో నిమగ్నమయ్యాయి. జిల్లాలోని 18 మండలాలకు సంబంధించి ఎంపీపీ అభ్యర్థుల కోసం ఇప్పటి నుంచే ఈ రెండు పార్టీలు కసరత్తు మొదలుపెట్టడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. అలాగే జడ్పీచైర్మన్ పదవిపై కన్నేసిన ఈ రెండు పార్టీల సీనియర్ నేతలు తమకు రిజర్వేషన్‌లు అనుకూలంగా వచ్చాయని, ఈ సారి ఎలాగైనా తమ అభ్యర్థిత్వాలను పరిగణలోకి తీసుకోవాలంటూ ఒత్తిడి మొదలుపెట్టాయి.

బీఆర్ఎస్‌లో తొలగని నైరాశ్యం...

అధికార కాంగ్రెస్, బీజేపీలు స్థానిక ఎన్నికల కోసం పోటాపోటీగా సమాయత్తమవుతున్నప్పటికీ బీఆర్ఎస్ పార్టీలో మాత్రం ఇప్పటికీ నైరాశ్యం తొలగడం లేదు. ఆ పార్టీ తరపు న పోటీ చేసేందుకు స్థానిక నేతలు పెద్దగా ఆసక్తి చూపించకపోతుండడం చర్చకు తావిస్తోంది. కొన్ని మండలాల్లో మాత్రమే ఆ పార్టీ నాయకులు పోటీకి సిద్ధమవుతున్నప్పటికీ మెజార్టీ మండలాల్లో ఇప్పటివరకు ఆ పార్టీ వైపు నుం చి ఆశావహులు ముందుకు రావడం లేదని అంటున్నారు. అయితే కనీసం తమ పార్టీ ఉనికిని కాపాడుకునేందుకైనా నామమాత్రపు పోటీలో తమ అభ్యర్థులను రంగంలోకి దింపాలని ఆ పార్టీలో కొనసాగుతున్న ఒకరిద్దరు సీనియర్ నేతలు భావిస్తున్నారు.

గోదావరి వద్ద దుర్గమ్మ విగ్రహాల నిమజ్జనం


దుర్గమ్మకు ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న దృశ్యం

బాసర, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : బాసర గోదావరి నదిలో శనివారం అమ్మవారి విగ్రహాలు నిమజ్జనానికి తరలి వచ్చాయి. నిర్మల్ జిల్లాతో పాటు, నిజామాబాద్, కామారెడ్డి, మహారాష్ట్ర నుంచి సైతం పదుల సంఖ్యలో దుర్గమ్మ విగ్రహాలు తరలివచ్చాయి. గోదావరి నది వద్ద దుర్గమ్మ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనం చేశారు.


నిమజ్జనం నిర్వహిస్తున్న దృశ్యం

హిందువుల ఐక్యతకు పంచపరివర్తన్

- **తెలంగాణ ప్రాంత కార్యదర్శి వెంకటేశ్వర్ రావు దేశ్‌పాండే**


సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన వక్త వెంకటేశ్వర్ రావు దేశ్ పాండే

నిర్మల్ రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : హిందువుల ఐక్యతకు పంచపరివర్తన్ ద్వారా ఆర్ఎస్ఎస్ కృషి చేస్తుందని వనవాసి కళ్యాణ పరిషత్ తెలంగాణ ప్రాంత కార్యదర్శి వెంకటేశ్వర్ రావు దేశ్‌పాండే పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవాలలో భాగంగా ఆర్ఎస్ఎస్ బంగల్‌పేట్ బస్తీ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్‌లో విజయ దశమి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానవక్త వెంకటేశ్వర్ రావు దేశ్‌పాండే (వనవాసి కల్యాణపరిషత్ తెలంగాణ ప్రాంత కార్యదర్శి) ప్రసంగించారు. 1925లో ప్రారంభమై నేడు దేశవ్యాప్తంగా విస్తృత శాఖలతో, వివిధ రంగాల్లో దేశభక్తి పూరిత, హిందుత్వ ఆధార సంస్థలతో ప్రపంచంలోని అనేక దేశాలలో పనిచేస్తుందని చెప్పారు. హిందువులలో ఐక్యతను శాఖ ఆధారంగా సంఘము పెంపొందిస్తుందన్నారు. హిందుత్వం జీవన విధానం, విశ్వశాంతికి ఆధారం, ప్రపంచంలోని వివిధ మతాలను సమన్వయపరిచే సనాతన జీవన విలువలు హిందుత్వంలో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథి కొర్తి కంటి లింగన్న మాట్లాడుతూ... ఆర్ఎస్ఎస్ ఈ దేశ అఖండతకు, వ్యక్తి నిర్మాణానికి, హిందుత్వ పరిరక్షణకు చేపడుతున్న చర్యలు అందరూ స్వాగతించాలని కోరారు. దేశవ్యాప్తంగా చేస్తున్న సేవా కార్యక్రమాలు ఆర్ఎస్ఎస్‌ను ప్రజలకు చేరువ చేసిందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో నగర కార్యవాహ కిస్నెర్లరవి, షైసర్ల రమణ, సాధం అరవింద్, పి.కృష్ణ, విలాస్, మందపవన్, సుదర్శన్ చారి, శ్రీను, సాయి, మురళి పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయ నిధి

లోకేశ్వరం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొడిసెరా గ్రామానికి చెందిన కే. రాములుకు సీఎం సహాయ నిది చెక్కు రూ. 60 వేలు మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి సహకారంతో గొడిసెరా మాజీ ఎంపీటీసీ కదం దత్తు పటేల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద కుటుంబాలకు చెందినవారు అనారోగ్యం పాలైతే ఇబ్బందులు పడకుండా ఇలాంటి వారు కార్పొరేట్ వైద్యం చేయించుకోవాలంటే ఎంతో ఖర్చుతో కూడుకున్నదన్నారు. అందుకోసం ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని కాంక్షించి వైద్య చికిత్స కోసం అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించి కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకునే వీలు కల్పించిందన్నారు. కార్యక్రమంలో గైని ఎల్లన్న, ఆనంద్ రావు, గంగుల శ్రీనివాస్, రాజేందర్ రెడ్డి, వినోద్, కిరణ్, తదితరులు ఉన్నారు.


సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న కదం దత్తు పటేల్

ఘనంగా శారదా దేవీ వేడుకలు

భైంసా,అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుజిరి గల్లిలో ఆర్యవైశ్య మండలి, గోపాల్ కృష్ణ మందిర్‌లో బ్రాహ్మణ్ సమాజ్ మహిళా మండలిల ఆధ్వర్యంలో శనివారం శారదాదేవి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు సంఘాల ఆధ్వర్యంలో ఉదయం వేళలో శారదాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు వైభవోపేతంగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆయా సంఘాల మహిళలు గేయాలు ఆలపిస్తూ శ్రీ శారదా దేవి విగ్రహలను శోభాయాత్రగా ప్రతిష్ఠాపన మండలిల వద్దకు తీసుకవచ్చారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాల ప్రతిష్ఠాపన చేశారు. ప్రారంభోత్సవ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐదురోజుల పాటు వేడుకలు జరుగనున్నాయి. విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్యవైశ్య మహిళా మండలికి చెందిన 108 మంది సాముహిక సహస్ర నామ పారాయణం చేపట్టారు.


శ్రీ శారద దేవీ విగ్రహం

సుర్జాపూర్‌లో వైభవంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు


డప్పుల చప్పుళ్లతో బయలుదేరిన భక్తులు


మంగళహారతులతో తరలివచ్చిన మహిళలు

- **ఘనంగా పందిరి పొరక ఎదుర్కోలు**
- **బ్రహ్మోత్సవాల వేళ వెల్లివిరిసిన మత సామరస్యం**
- **మైనార్టీ భక్తుని సంకల్పంతో గ్రామంలో నంది విగ్రహావిష్కరణ**

ఖానాపూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుర్జాపూర్ గ్రామంలోని అతి పురాతన ఆలయమైన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు గత రెండు రోజులుగా అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా శనివారం ఆలయంలో వేద పండితులు చక్రపాణి నరసింహ మూర్తి ఆధ్వర్యంలో అంకురార్పణ, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం స్వామివారి పెళ్లి పందిరి పచ్చని పొరక ఎదుర్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఎదుర్కోలు కార్యక్రమానికి మహిళలు మంగళహారతులతో భారీగా తరలి వచ్చారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు ఆలయ ప్రాంగణంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బృందం తెలిపింది.

వెల్లివిరిసిన మత సామరస్యం...

సుర్జాపూర్ గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్న వేళ మత సామరస్యం వెల్లివిరిసింది. గ్రామానికి చెందిన సయ్యద్ పీర్ మహమ్మద్ అనే మైనారిటీ భక్తుడు సంకల్పంతో దాతల సహకారంతో నందీశ్వరుని విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామంలోని ప్రధాన కూడలిలో గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన నందీశ్వరుని విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీర్ మహమ్మద్ మాట్లాడుతూ... హిందువులు, ముస్లింలు ఐక్యంగా ముందుకు సాగాలనే ఉద్దేశంతో నందీశ్వరునిపై ఉన్న అభిమానంతో తాను ఈ సంకల్పం చేశానన్నారు. ఈ విగ్రహం ఏర్పాటుకు తనకు పలువురు దాతలు సహకరించారని పేర్కొన్నారు. పీర్ మహమ్మద్ చేసిన సంకల్పం మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిందని పలువురు కొనియాడారు.

కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి

- **ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు**


మాట్లాడుతున్న బీఆర్ఎస్ సమన్వయ సమితి సభ్యులు

కుంటాల, అక్టోబరు,4 : (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినప్పటికీ ఎలాంటి అభివృద్ధి సంక్షేమ పథకాలు చేపట్టడం లేదని ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు విలాస్ గాదేవార్, లోలం శ్యాంసుందర్, కిరణ్ కొమ్రేవార్‌లు అన్నారు. శనివారం కుంటాల మండల బీఆర్ఎస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కార్యక్రమంలో భాగంగా కల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందని, రుణమాఫీ, పెన్షన్లు, తదితర పథకాలను ప్రవేశపెట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పడకంటి దత్తు, నాయకులు దశరథ్, పోశెట్టి, శ్రీనివాస్ రావు, దత్తుతో పలు గ్రామాల బీఆర్ఎస్ పార్టీ నాయకులున్నారు.

పాఠశాలకు ప్రింటర్ అందజేత


ప్రింటర్‌ను విరాళంగా అందజేస్తున్న నిగ్వ శ్రావణ్ రెడ్డి

ముథోల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆష్టా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఆష్టా గ్రామానికి చెందిన నిగ్వ శ్రావణ్ రెడ్డి రూ. 20 వేల విలువ గల ఆల్ ఇన్ వన్ ప్రింటర్‌ను శనివారం విరాళంగా అందజేశారు. పాఠశాల అభివృద్ధికి చేయూత అందించిన శ్రావణ్ రెడ్డిని ముథోల్ మండల విద్యాధికారి గోపిడి రమణారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునందా దేవి, ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు బిజ్జూరు సాయరెడ్డి, ఉపాధ్యాయులున్నారు.

నిరుపేదలకు అన్నదానం

లోకేశ్వరం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఒక కార్యక్రమంలో మిగిలిపోయిన ఆహార పదార్థాలను సేకరించిన ఫుడ్‌బ్యాంక్ భైంసా వ్యవస్థాపకులు ఆంజనేయులు ఆహార పదార్థాలను లోకేశ్వరం మండలంలోని లక్ష్మీనగర్ గ్రామంలోని దాదాపు 130 మంది నిరుపేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ... ఎన్ని కష్టాలు, బాధలు ఎదురైనా నిరుపేదలకు చేసే అన్నదాన కార్యక్రమాన్ని ఆపేది లేదని, అదేవిధంగా ఎక్కడైనా ఫంక్షన్‌లో ఆహార పదార్థాలు మిగిలిపోయినచో పారవేయకుండా మా నెంబర్‌కు 9912267973 ఫోన్ చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే కఠిన చర్యలు : సీఐ

● మల్టీ మార్కెట్ పేరిట మోసం.. ముగ్గురిపై కేసు


ప్యాకెట్లను చూపుతున్న సీఐ

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే కఠిన చర్యలు తప్పవని టూటౌన్ సీఐ నాగరాజు హెచ్చరించారు. మల్టీ మార్కెట్ పేరిట మోసం చేసిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శనివారం టూటౌన్‌లో వివరాలను వెల్లడించారు. సింగపూర్, పంజాబ్‌లో ఆరోగ్యానికి సంబంధించిన ప్యాకెట్లను తయారు చేసి జిల్లాలో విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఔషధ ఉత్పత్తులు వినియోగిస్తే అన్నిరకాల రోగాలకు పనిచేస్తుందని ప్రజలను నమ్మబలుకుతున్నారని తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలో విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తే వ్యవహారం బయట పడిందన్నారు. జిల్లాకేంద్రంలోని బృందావన్ కాలనీలో నివాసం ఉంటున్న నార్నూర్‌కు చెందిన మహేందర్, తాంసి మండలంలోని బండల్‌నాగాపూర్‌కు చెందిన రాకేష్‌లు విక్రయిస్తున్నట్లు తెలిపారు. వీరిద్దరు ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన ముకుంద్‌రావు వద్ద వీటిని కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. వీరివద్ద నుంచి 5ప్యాకెట్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని వివరించారు. కాగా ఆ ప్యాకెట్లపై ఎంఆర్‌పీ ధర, గుర్తింపు లెబల్, తయారి తేదీ, గడువు లేవన్నారు. ఒక్కో ప్యాకెట్‌ను రూ.5800 వరకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. ముగ్గురిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

గడువు దాటిన తినుబండరాల అమ్మకాలు

ఇచ్చోడ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పలు దుకాణాలు, బేకరీలలో అమ్ముతున్న తినుబండారాలు చాలామట్టుకు గడువు దాటిపోయినవి ఉంటున్నాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు తినే తినుబండారాలు గడువు దాటిపోయి ఉండడం గమనార్హం. మండల కేంద్రంలోని ఓ బేకరీలో బ్రెడ్ ప్యాకెట్‌ను పరిశీలించగా.. గడువు దాటిపోయి ఉన్నప్పటికి బహిరంగంగా విక్రయాలు చేపడుతున్నారు. దీని ద్వారా వాటిని తినే పిల్లలకు అపాయం కలిగే అవకాశం ఉంది. ఇది గమనించిన కొనుగోలుదారు.. బేకరీ యజమానిని ప్రశ్నించగా.. వెంటనే మార్చి గడువు ఉన్నది ఇవ్వడం విశేషం. గమనించకపోతే అదే వస్తువును అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారు. గడువు దాటిన బ్రెడ్ ప్యాకెట్లను కంపెనీ వారికి అప్పజెప్తామని అందుకే ఇలా కౌంటర్‌పై ఉంచాల్సి వచ్చిందని బేకరి యజామాని తెలపడం విశేషం. కంపెనీ వారు గడువు ముగిసిన వాటిని తీసుకెళ్లి ఏం చేస్తారు.. అనే కొత్త అనుమానాలను తావిస్తోంది. ఇకనైనా సంబంధిత అధికారులు బేకరీలు, హోటళ్లలో తనిఖీలు చేపట్టి ఎక్స్‌పైరీ అయిన వాటిని విక్రయించే వారిని కట్టడి చేయాలని స్థానికులు కొరుతున్నారు. చిన్నపిల్లలు తినే తినుబండరాల పట్ల బాధ్యతగా ఉండాలని, గడువు ముగిసిన వాటిని విక్రయించకుండా బేకరీ, దుకాణాదారులు జాగ్రత్తలు చేపట్టాలని కొరుతున్నారు.

రాయితీ బియ్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రభుత్వం పంపిణీ చేసే రాయితీ బియ్యం తరలిస్తున్న ఇద్దరిని పట్టుకొని, అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు వన్ టౌన్ సీఐ బి.సునీల్ కుమార్ తెలియజేశారు. స్థానిక ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొక్కల గూడలో పీడీఎస్ రైస్ అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం మేరకు తనిఖీ చేశారు. ఈ క్రమంలో షేక్ ఫైజన్, అబ్దుల్ సత్తార్‌లు అక్రమంగా రాయితీ బియ్యాన్ని ప్రజల వద్ద కొనుగోలు చేసి తరలిస్తుండగా 3.2 క్వింటాల్లు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రెండు స్కూటీలు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ప్రజలు, రేషన్ డీలర్‌లు అక్రమంగా రాయితీ బియ్యాన్ని దుర్వినియోగం చేసిన, అధిక ధరలకు అమ్మిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. ప్రజలు తరచూ రేషన్ బియ్యాన్ని దుర్వినియోగం చేస్తే రేషన్ కార్డు రద్దు చేసే విధంగా చర్యలు తీసుకోబడతాయన్నారు. అదేవిధంగా ప్రజల వద్ద అధిక ధరలకు అమ్ముకోవడానికి రేషన్ బియ్యాన్ని జమ చేసే వ్యక్తులపై దర్యాప్తు కొనసాగుతుందని పూర్తి విచారణ అనంతరం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సరిహద్దుల్లో పటిష్టమైన నిఘా : సీఐ

బోథ్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ రావడంతోనే బోథ్ పోలీసులు పటిష్టమైన చర్యలు చేపట్టారు. బోథ్ మండలంలోని బెల్ట్ షాపులపై పోలీసు నిఘా పెంచడంతో పాటు మద్యం విక్రయాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు చేపట్టారు. మరోవైపు దాబా హోటల్లో స్థానిక హోటలలో మద్యం విక్రయించే వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. అయితే సరిహద్దుల్లో ఉన్న ఘన్పూర్ చెక్ పోస్టు వద్ద ప్రత్యేకమైన చెక్ పోస్టు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్సై శ్రీ సాయి తెలిపారు. కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు.



ఘన్పూర్ చెక్ పోస్టు వద్ద నిఘా ఉన్న పోలీసులు

దాబాల్లో మద్యం విక్రయిస్తే చర్యలు

దాబా హోటల్ లో కానీ ఇతర హోటలలో మద్యం విక్రయించడంతో పాటు సిట్టింగులకు అనుమతులు ఇస్తే యజమానులపై కేసులు తప్పవని సీఐ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మద్యం విక్రయాలపై ఇప్పటికే ఓటర్ల యజమానులకు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయించిన హోటలలో మద్యం సేవించేందుకు అనుమతులు ఇచ్చిన కేసులు తప్పవన్నారు.

తృటిలో తప్పిన విద్యుత్ ప్రమాదం

● జన సంచారంలో తెగిపడ్డ విద్యుత్ వైర్లు
● అయినా.. వీడని అధికారుల నిర్లక్ష్యం


బజార్ హత్నూర్‌లో తెగిపడ్డ విద్యుత్ వైర్లను సరి చేస్తున్న సిబ్బంది

బజార్‌హత్నూర్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం హఠాత్తుగా విద్యుత్ వైర్లు జనావాసాల్లో తెగిపడ్డాయి. దీంతో సమీపంలో వెళుతున్న వారు భయభ్రాంతులకు లోనై పరుగులు తీశారు. తృటిలో ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగా మండల కేంద్రంలో విద్యుత్ సంఘటనలు చోటు చేసుకోవడం ఇది మూడోసారి. ఇలా సంఘటనలు పునరావృత్తం అవుతున్నా విద్యుత్ అధికారులు మాత్రం శాస్వత పరిస్కారం వైపు ఆలోచనలు వేయకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేబుతున్నారు. నాణ్యత లోపించి కాలం చెల్లిన వైర్ల కారణంగానే ఈ సంఘటనలు పునరావృతం అవుతున్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇవి అధికారుల నిర్లక్ష ధోరణికి అద్దం పడుతున్నాయంటున్నారు. ఇప్పటికైనా కొత్తవి అమర్చి విద్యుత్ ను పునరుద్దరించాలని వారు కోరుతున్నారు. విషయం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది వెంటనే వైర్లను సరి చేసి విద్యుత్ పునద్దరించారు.

బాధిత కుటుంబానికి ఎంపీ పరామర్శ

బోథ్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సోనాల మండలంలోని చింతలబోరి గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు డి.విష్ణు చిన్న నాన్న ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీ జి.నగేష్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందంతో కలిసి దిగులే విష్ణు ఇంటికి వెళ్లి పరామర్శించడం జరిగింది. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

టవర్ ఏర్పాటు చేయించాలని వినతి

నేరడిగొండ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): టవర్ ఏర్పాటు చేయించాలని కోరుతూ శనివారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు కుఫ్టి, కుమారి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. మండలంలోని కుఫ్టి, కుమారి గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే టవర్ ఏర్పాటు చేయిస్తానని హామీనిచ్చారు.

శుద్ధ జల ప్లాంట్ ప్రారంభం

నేరడిగొండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తమ తండ్రి జ్ఞాపకార్థం నీటి శుద్ధ జల ప్లాంట్‌ను ప్రారంభించడం అభినందనీయమని కాంగ్రెస్‌పార్టీ బోథ్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మండలంలోని బొండిడి గ్రామానికి చెందిన ఆడే సకారం మృతి చెందగా వారి కుమారులు డాక్టర్ ఆడే రజిత్ క్రాంతికుమార్, సతీష్ నాయక్‌లు తమ తండ్రి ఆడే సకారం జ్ఞాపకార్థం రూ.నాలుగు లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను సొంత గ్రామం బొండిడిలో ఏర్పాటు చేశారు. కాగా శుక్రవారం ఆడే గజేందర్, ఇచ్చోడ మాజీ ఏఎంసీ చైర్మన్ ఆడే శీలలు ప్రారంభించారు.

ఆపరేటర్ల జీతాలు చెల్లించండి

నేరడిగొండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే సందర్భంగా నియమించిన ప్రైవేట్ డేటా ఆపరేటర్ల వేతనాన్ని వెంటనే చెల్లించాలని మానవ జాతీయ హక్కుల సంఘం జిల్లా వైస్ చైర్మన్ రాథోడ్ సందీప్ అన్నారు. శనివారం నేరడిగొండ ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఇందులో నేరడిగొండ మండల చైర్మన్ నర్సింగ్ దాస్, డి.కృష్ణ విలేజ్ కమ్యూనిటీ చైర్మన్, కె. మహేందర్ మరియు సమగ్రత కుటుంబ సర్వేలో పనిచేసిన ప్రైవేట్ డేటా ఆపరేటర్లు ఉన్నారు.

పురుగుమందు పిచికారీ కిట్ల పంపిణీ

నేరడిగొండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ వైడ్ ఫండ్ ఆధ్వర్యంలో రైతులకు పురుగుమందు పిచికారీ కిట్లను శనివారం మండల కేంద్రంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లస్టర్ మేనేజర్ వంశీ మహేష్ మాట్లాడుతూ రైతులకు పురుగు మందులు పిచికారీ చేసేటప్పుడు పీపీఈ కిట్స్‌ను ధరించి పిచికారి చేయడం వలన శరీరానికి ఎలాంటి ప్రమాదకరం ఉండదని అన్నారు. గ్రామ రైతులు, ఫీల్డ్ ఫెసిలెటర్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలిచే అభ్యర్థులకే టిక్కెట్

సిరికొండ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచే అభ్యర్థులకే పార్టీ టిక్కెట్లు కెటాయిస్తుందని బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు ఓరగంటి పెంటన్న, కదం సూర్యకాంత్, విజయ్ కుమార్, ఎండీ ఎక్బాల్, తోకల చందు, లతీఫ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

హైకోర్టు తీర్పుపై.. ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి...)

గాదిగూడ మండలం నుంచి చాలా మంది నేతలు పోటీ చేసే అవకాశం ఉందంటున్నారు.

బీసీ స్థానాల్లో మార్పు?

బీసీ రిజర్వేషన్లపై అక్టోబరు 8న హైకోర్టు తీర్పు వెలువడనుంది. ఆ తర్వాతనే స్థానిక ఎన్నికల రాజకీయం ఊపందుకునే అవకాశం కనిపిస్తుంది. ఎందుకంటే ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడంపై పలువురు హైకోర్టును ఆశ్రయించారు. చట్టబద్దత లేని 42 శాతం రిజర్వేషన్ల పై హైకోర్టు వ్యతిరేకతను వ్యక్తం చేస్తే పరిస్థితి ఏమిటన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అదే జరిగితే ప్రస్తుతం ఉన్న ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్, వార్డు మెంబర్ బీసీ రిజర్వేషన్లలో మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉందంటున్నారు. బీసీ రిజర్వేషన్‌ల స్థానంలో జనరల్ స్థానాల సంఖ్య పెరిగే అవకాశం లేక పోలేదంటున్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌లలో మాత్రం ఎలాంటి మార్పులు ఉండవంటున్నారు. ఇలాంటి పరిస్థితులతో హైకోర్టు తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ కనిపిస్తోంది.


మాట్లోద్దిలో వైద్య చికిత్సలు అందజేస్తున్న సిబ్బంది

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నేరడిగొండ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సద్దాం అన్నారు. శనివారం మండలంలోని మాట్లోద్ది గ్రామంలో వైద్య సిబ్బంది, మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ ఎ.సంతోష్, ఏఎన్ఎం జ్యోతి, ఆశా రమాదేవి తదితరులు ఉన్నారు.

కబ్జాకు యత్నించిన 48 మంది పై కేసు

ఉట్నూర్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పథకం ప్రకారం గుడిసె స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించిన నిందితులలో ఏడుగురుని రిమాండ్ చేసి 48 మందిపై కేసు నమోదు చేశామని ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని హనుమాన్‌నగర్‌లో జాదవ్ మేఘనాథ్‌పై దాడి చేసి గుడిసె కూల్చివేసి, సీసీటీవీ కెమెరాలను ధ్వంసం చేసిన సందర్భంగా దాడిని ఆపడానికి యత్నించిన పోలీసులపై దాడికి నిందితులు పాల్పడ్డారని సీఐ తెలిపారు. జాదవ్ మేఘనాథ్ ఫిర్యాదు మేరకు బానోతు జగన్ మరియు ఆయన అనుచరులు అక్రమంగా తన ఇళ్లు, కిరాణ షాపును దక్కించుకోవాలనే దురుద్దేశంతో కర్రలు, రాళ్లు, కట్టెలతో దాడి చేశారని బాధితులు ఫిర్యాదు చేశాడన్నారు. ఈ సంఘటనలో గుడిసెను ధ్వంసం చేయడంతో పాటు సీసీటీవీ కెమెరాలను కూడా పాడు చేశారని వీరి దాడిలో ఫిర్యాదుదారుని కుమార్తెకు గాయమైందన్నారు. సుమారు రూ.50వేల విలువైన నష్టం సంభవించినట్లు ఫిర్యాదుదారుడు పేర్కొన్నారన్నారు. నిందితులు బాధితుని స్థలంలో జెండా పాతడానికి ప్రయత్నించగా బాధితుడు అడ్డుకోవడానికి యత్నించిన, బాధితునిపై బూతులు తిడుతు దాడికి పాల్పడ్డారన్న విషయాన్ని మేఘరాజ్ తెలిపారన్నారు. ఈ సంఘటనలో పోలీసులు పరిస్థితిని అదుపు చేయడానికి వెళ్లినప్పుడు నిందితులు దాడి చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఉట్నూర్ పోలీసు స్టేషన్‌లో బానోత్‌జగన్, బానోత్‌గణేష్, నునావత్ భీముడు, ఆడే విజయ్‌కుమార్, పద్మావత్‌యశ్వంతరావు, రాథోడ్ రవీందర్, పద్మావత్ ఓంకార్ మరియు 41 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు. మిగిలిన నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని అందులో నుంచి పైన పేర్కొన్న ఏడుగురిని ఈ రోజు రిమాండ్ చేశామని సీఐ మడావి ప్రసాద్ వివరించారు.

కాల్వలో ప్రత్యేక పూజలు


కాల్వ ఆలయంలో గీతామూర్తి

దిలావర్‌పూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాల్వ అడవుల్లో కొలువైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా మాజీ అధ్యక్షురాలు, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు గీతా మూర్తి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గీతామూర్తి వెంట సాహితి, రోషిణి శర్మ, సుముఖ్‌లు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


దిలావర్‌పూర్‌లో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు యూసుఫ్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి

దిలావర్‌పూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆప్తులను కోల్పోయి బాధలో ఉన్న కుటుంబాలను శనివారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పరామర్శించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు యూసూఫ్ ఇటీవల పితృవియోగం చెందాడు. అలాగే గుండంపల్లిలో ప్రముఖ న్యాయవాది కొమ్ముల వినాయక్ రెడ్డి సైతం పితృ వియోగంతో బాధపడుతుండగా, సిర్గాపూర్‌లో సి.నారాయణ్ రెడ్డి మాతృవియోగంతో, సాంగ్విలో సీనియర్ నాయకుడు మనోహర్ రావు మాతృవియోగంతో బాధపడుతుండగా ఆయా కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి వారికి ధైర్యం చెప్పారు. మాజీ మంత్రి వెంట పీఏసీఎస్ చైర్మన్ పీవీ రమణారెడ్డి, కండెల శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గురుస్వామికి అరుదైన పురస్కారం


పీఎన్ మూర్తిని సన్మానిస్తున్న మహాశాస్త్ర సేవాట్రస్ట్ బృందం

నిర్మల్ రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మహాశాస్త్ర సేవా ట్రస్ట్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించే సేవాపురస్కారాల కార్యక్రమంలో హరిహర క్షేత్రం ఆలయ గురుస్వామి పీఎన్ మూర్తికి అన్నపూర్ణ గురు పురస్కారం శనివారం హైదరాబాద్ త్యాగరాజ గాన సభలో మనసన్మానంతో పాటు సేవా పురస్కారాన్ని అందించినట్లు తెలిపారు.

ఖానాపూర్‌లో భారీ వర్షంలోనే వేడుకలు

● సత్తెనపల్లి సబ్ స్టేషన్‌లో తలెత్తిన విద్యుత్ సమస్య
● పలు గ్రామాల్లో చీకట్లోనే బతుకమ్మ వేడుకలు
● మహిళలకు ఇబ్బందులు


తర్లపాడ్ గ్రామంలో చీకట్లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఖానాపూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శనివారం నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల వేళ ప్రకృతి సహకరించక మహిళలు ఇబ్బందులు పడ్డారు. ఈ ఏడాది ఆది నుండి బతుకమ్మ వేడుకలకు అంతరాయం కలిగిస్తున్న వరుణుడు చివరి రోజైన సద్దుల బతుకమ్మ వేడుకలలో సైతం తన ప్రతాపాన్ని చూపించాడు. శనివారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశంలో కారు మబ్బులు కమ్ముకొని మండలంలో భారీ వర్షం కురిసింది. దీంతో సాయంత్రమే ప్రారంభం కావలసిన సద్దుల బతుకమ్మ వేడుకలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. కాగా మండలంలో కురిసిన భారీ వర్షంతో పాటు ఉరుములు, మెరుపులతో వచ్చిన పిడుగుపాటుతో సత్తెనపల్లి 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్య తలెత్తి ఒక ఫేస్ సప్లై నిలిచిపోయినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. దీంతో సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 7 గంటల 20 నిమిషాల వరకు సత్తెనపల్లి, తర్లపాడ్, పాత తర్లపాడ్, అడవి సారంగాపూర్ నాలుగు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చిమ్మ చీకట్లోనే మహిళలు బతుకమ్మ ఆడాల్సిన పరిస్థితి తలెత్తింది. చీకట్లో బతుకమ్మ ఆడేందుకు పలు గ్రామాల్లో మహిళలు ఇబ్బందులు పడ్డారు. కాగా పాత ఎల్లాపూర్ సబ్ స్టేషన్ నుండి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. బతుకమ్మ నిమజ్జన వేడుకలు జరుగుతున్న వేళ ఓ సబ్ స్టేషన్‌లో సాంకేతిక సమస్య తలెత్తితే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా అధికారులు జాప్యం చేయడం పట్ల పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. బతుకమ్మ నిమజ్జన కార్యక్రమానికి మహిళలు, చిన్న పిల్లలంతా రోడ్ల పైకి వచ్చిన సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడం, అంతకుముందే భారీ వర్షం కురిసి ఉండడంతో వారంతా ఇబ్బందులు పడ్డారు.


శనివారం సాయంత్రం ఖానాపూర్‌లో కురుస్తున్న వర్షం

ఘనంగా బతుకమ్మ


బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

సారంగాపూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చించోలి(బీ) గ్రామంలోని గుర్జికింది గల్లీలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. గణేష్ మండలి ఆధ్వర్యంలో అయిట్ల లక్ష్మణ్ అమ్మవారి ప్రతిరూపంగా గును గు, తంగేడు, బంతిపూలతో ఉయ్యాల బతుకమ్మను తయారు చేశారు. ఉయ్యాల బతుకమ్మ పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులు బతుకమ్మ పాటలకు కోలాటాలు వేస్తూ, నృత్యాలు చేస్తూ ఆడిపారు. అనంతరం బతుకమ్మను స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు మహిళలు, చిన్నారులు, పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.


గుర్జికింది గల్లీలోని ఉయ్యాల బతుకమ్మ



బతుకమ్మతో చిన్నారి

హిందువుల ఐక్యతకు పంచ పరివర్తన్ కృషి

లక్ష్మణచాంద, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : హిందువుల ఐక్యతకు పంచ పరివర్తన్ ద్వారా ఆర్ఎస్ఎస్ కృషి చేస్తుందని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘ జిల్లా క్రీడా అధ్యక్షుడు అన్నం వాసుదేవ రెడ్డి అన్నారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవాలలో భాగంగా ఆర్ఎస్ఎస్ మల్లాపూర్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విజయ దశమి ఉత్సవం ఘనంగా శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రధాన వక్తగా మాట్లాడుతూ.... 1925 లో ప్రారంభమై నేడు దేశ వ్యాప్తంగా విస్తృత శాఖలతో, విభిన్న రంగాల్లో దేశభక్తి పూరిత, హిందుత్వ ఆధార సంస్థలతో ప్రపంచంలోని అనేక దేశాలలో పని చేస్తుందని చెప్పారు. హిందువులలో ఐక్యతను శాఖ ఆధారంగా సంఘము పెంపొందిస్తుందని పేర్కొన్నారు. హిందుత్వం జీవన విధానం, విశ్వశాంతికి ఆధారమని, ప్రపంచంలోని వివిధ మతాలను సమన్వయ పరిచే సనాతన జీవన విలువలు హిందుత్వంలో ఉన్నాయని వివరించారు. దేశ అభివృద్ధి కోసం హిందువులు పంచ పరివర్తన కోసం పాటుపడాలని సూచించారు. సామాజిక సామరస్యత కుటుంబ జీవన విలువలు, స్వఆధారిత జీవనం, పర్యావరణ పరిరక్షణ, పౌర విధులు ప్రతి ఒక్కరి కుటుంబంలో పాటించాలని కోరారు. ఆర్ఎస్ఎస్ రాబోయే రోజుల్లో ఇంటింటి జనజాగరణ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పెద్దమాల చరణ్ మాట్లాడుతూ... ఆర్ఎస్ఎస్ ఈ దేశ అఖండతకు, వ్యక్తి నిర్మాణానికి, హిందుత్వ పరిరక్షణకు చేపడుతున్న చర్యలు అందరూ స్వాగతించాలని కోరారు. దేశ వ్యాప్తంగా చేస్తున్న సేవా కార్యక్రమాలు ఆర్ఎస్ఎస్‌ను ప్రజలకు చేరువ చేసిందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఖండ శారీరక్ ప్రముఖ్ ముఖేష్, స్వయం సేవకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మల్లాపూర్‌లో మాట్లాడుతున్న వాసుదేవ రెడ్డి

అంకితభావంతో పనిచేయడం అభినందనీయం


సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్ సన్మానిస్తున్న దృశ్యం

నర్సాపూర్(జి), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : గిరిజన సంక్షేమ విభాగంలో దాదాపు 30 సంవత్సరాల పాటు సుదీర్ఘకాలం ఆశ్రమ పాఠశాలలోని హాస్టల్‌లో కామాటిగా విధులు నిర్వహించి, బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు కూడా పొందిన మాలేపు విజయని శుక్రవారం సమత ఫౌండేషన్ ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో ఫౌండేషన్ సీఈవో అనిల్ కుమార్, సాజిత్, ముత్యం, సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు. మాలేపు విజయ అంకితభావం, నిబద్ధత అందరికీ ఆదర్శనీయమని వారు కొనియాడారు.


అతి పెద్ద బతుకమ్మకు పూజలు చేస్తున్న జిల్లా కలెక్టర్


భారీ బతుకమ్మ వద్ద మహిళలు


తలమడుగులో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు


బతుకమ్మ గీతాలకు అనుగుణంగా కోలాటాలు ఆడుతున్న మహిళలు


బతుకమ్మ ఆడుతున్న మహిళలు

తెలంగాణ సంస్కృతికి ప్రతీక.. బతుకమ్మ

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా
- ఆడి పాడిన కలెక్టర్, ఎస్పీలు

తాంసి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తుందని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం సాయంత్రం తాంసి మండలంలోని కప్పర్ల గ్రామంలో నిర్వహించిన సామూహిక బతుకమ్మ వేడుకలకు జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్‌తో కలిసి హాజరయ్యారు. ముందుగా స్థానిక రామాలయం ప్రాంగణంలో గ్రామస్తులు, మహిళలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి బతుకమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలతో కలిసి కలెక్టర్, ఎస్పీలు బతుకమ్మలో ఆడి సందడి చేశారు. చప్పట్లు కొడుతూ పెదవులు కలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజార్షి షా, ఎస్పీ అఖిల్ మహజన్‌లు మాట్లాడుతూ కప్పర్ల గ్రామంలో నిర్వహించిన సామూహిక బతుకమ్మల నిమజ్జనం రాష్ట్రంలో ఒక ప్రత్యేకతను చాటుకుంటుందన్నారు. తెలంగాణలో నిర్వహిస్తున్న బతుకమ్మ దేశానికి ఆదర్శంగా నిలిచాయని ఈ సంబరాలు ప్రపంచంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందన్నారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

ఆదిలాబాద్ టౌన్: జిల్లాలో సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్ని తాకుతున్నాయి. దసరా తర్వాత నుంచి వేడుకలు జిల్లాలో కొనసాగడం ఆనవాయితీగా వస్తున్న నేపథ్యంలో వేడుకలను ఊరువాడా ఘనంగా జరుపుతున్నారు. అదేవిధంగా పట్టణంలోని పలు కాలనీల్లో శారదా దేవి విగ్రహాల నిమజ్జనం అట్టహాసంగా సాగింది.

కప్పర్లలో

తాంసి: పోయిరా బతుకమ్మ.. పోయిరావమ్మ అంటూ మండలంలోని కప్పర్ల గ్రామంలో బతుకమ్మల నిమజ్జనం అంగరంగ వైభవంగా జరిగింది. శనివారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమైన ఈ బతుకమ్మల నిమజ్జనం అద్యాంతం కన్నుల పండుగగా కొనసాగింది. గ్రామంలోని బతుకమ్మలతో మహిళలు స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణానికి చేరుకున్నారు. బతుకమ్మలతో మహిళలు ఆటలాడుతూ పాటలు పాడారు. కోలాటాలు వేశారు. ఈ వేడుకల్లో ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత సైతం ఆడి పాడింది. అనంతరం వాగులో నిమజ్జనం చేశారు.


బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న కంది శ్రీనివాస రెడ్డి దంపతులు

ఘనంగా బతుకమ్మ సంబరాలు

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. పట్టణంలో పలు చోట్ల అత్యంత వైభవంగా జరిగిన బతుకమ్మ వేడుకలలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి తన సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డితో కలిసి పాల్గొన్నారు. తిర్పెల్లిలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొని పలు శారదా దేవి మండపాలను దర్శించుకున్నారు. ఆయా మండపాల నిర్వాహకులు కంది శ్రీనివాసరెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ తాలూకా పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షులు బొమ్మకంటి రమేష్, పట్టణ మహిళ పద్మశాలి సంఘం అధ్యక్షురాలు తన్నీరు నవత, చిలుక విలాస్, మోర ఆశన్న, బూర్ల శంకరయ్య, చిప్ప గంగన్న, మెంచు అశోక్, మహేష్, దాసరి రమేష్, ముదిగొండ సుధాకర్ పాల్గొన్నారు.

బతుకమ్మ పాట ఆవిష్కరణ


పాటను తిలకిస్తున్న నేతలు

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా కళాకారులు రాచర్ల మహేష్ బృందం, శ్రీకృతి డాన్స్ అకాడమీ, మున్నూరు కాపు సంఘం సహకారంతో సంయుక్తంగా రూపొందించిన మా ఇంటి బతుకమ్మ బతుకమ్మ పాటను కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి తన క్యాంపు కార్యాలయంలోని సమావేశ మందిరంలో తన సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి లాంచ్ చేశారు. బిగ్ స్క్రీన్‌పై తిలకించి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా మంచి పాటను నృత్యరూపకంతో రూపొందించిన డైరెక్టర్ మహేష్‌ను రచయిత, గాయని సుజాత యాదవ్, కొరియోగ్రాఫర్ రాజ్ కిరణ్, కెమెరా మెన్ కొత్తపల్లి కృష్ణ, ఎడిటర్ సాయి పవన్‌లను ఆయన అభినందించి శాలువాలతో సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని మంచి కళారూపాలు నిర్మించి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,బండారి సతీష్, దర్శనాల లక్ష్మణ్, దుర్గం శేఖర్, బూర్ల శంకరయ్య, తిరుమల్ రెడ్డి, మహిళా నాయకురాళ్లు దేశెట్టి ప్రభావతి, శ్రీలేఖ, నృత్యకళాకారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సన్నాహక సమావేశం

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక జడ్పీటీసీ, యంపీటీసీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం తన క్యాంపు యాల్లోయంలోని సమావేశ మందిరంలో మండలాల ముఖ్యనాయకులు కార్యకర్తలతో విడివిడిగా సమావేశమయ్యారు. బేల, భోరజ్, జైనథ్ మండల నాయకులతో భేటీలో పలు అంశాలపై చర్చించారు. పోటీకి సిద్ధంగా ఉండే ఆశావహులు వారికి ఆయా ప్రాంతాలలో ఉన్న బలాబలాలపై సమీక్ష జరిపారు. జడ్పీటీసీ, ఎంపీటీసీలలో ప్రతీ స్థానం నుంచి కొందరి ఆశావహుల పేర్లు పరిశీలనలోకి తీసుకుని అధిష్టానం సూచనలతో తుది జాబితా ఖరారు చేస్తామన్నారు. గెలిచే సత్తా ఉన్న అభ్యర్థులకు తప్పకుండా తదిజాబితాలో చోటు దక్కుందన్నారు. ఎవరికి టికెట్ లభించినా అంతా కలిసి స్థానిక ఎన్నికల్లో గెలుపేలక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ నియోజకవర్గంలోని బేల, జైనథ్, భోరజ్ మండలాలలకు చెందిన ముఖ్యనాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కంది శ్రీనివాస రెడ్డి

విజృంభిస్తున్న విష జ్వరాలు


బోథ్ ఆస్పత్రిలో చేరిన రోగులు


బోథ్ ఆస్పత్రిలో వైద్యం కోసం బారులు తీరిన రోగులు

» ఆస్పత్రుల్లో

నిండుకుంటున్న రోగులు

బోథ్, అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వ్యాధులు మండల ప్రజలను చుట్టుముడుతున్నాయి. వర్షాల తీవ్రత వీడక పోవడంతో రోగాలకు వాతావరణం అనుకూలం గా ఉండడంతో మండలంలో జ్వరాల తీవ్రత రోజురోజుకు విజృంభిస్తున్నది. ఫలితంగా ప్రజలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం కోసం బారులు తీరుతున్నారు. ప్రతీరోజు ప్రభుత్వ ఆసుపత్రిలో 150 నుంచి 250వరకు రోగులు వైద్య పరీక్షల కోసం వస్తున్నారు.

దోమల తీవ్రత అధికం

మండలంలోని పలు గ్రామాల్లో దోమల తీవ్రత విపరీతంగా ఉందని వివిధ గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గ్రామ పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతుండగా గ్రామాల కార్యదర్శులు అప్పుల పాలు కావడంతో బ్లీచింగ్ పౌడర్‌తో పాటు మురికి కాలువలను శుభ్రం చేయించడం తలకుమించిన భారంగా మారింది. మరోవైపు గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు సంబంధించిన వేతనాలు సైతం రాకపోవడంతో మురికి కాలువలను శుభ్రం చేయడంలో జాప్యం జరుగుతుంది. ఫలితంగా గ్రామాలు మురికి కూపాలుగా మారుతున్నాయి. మరోవైపు ప్రతి రోజు వర్షం కురుస్తుండడంతో తేమ వీడక దోమల బెడద తీవ్రమవుతుంది. పగలు, రాత్రి ఇళ్లలో ఫ్యాన్ తిరగనిదే నిలవలేక పోతున్నారు.

వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలి..

బోథ్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో వ్యాధులు విజృంభిస్తుండడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు వైద్యం కోసం డబ్బులు ఖర్చు చేసుకోవాల్సి వస్తుంది. ప్రభుత్వ వైద్యం బోథ్ లేదా సోనాల మండల కేంద్రానికి వెళ్తే అందే విధంగా ఉందని తాము ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలన్న చేతిలో చిల్లిగవ్వ లేక ఇబ్బందులకు గురవుతున్నామని పేదలు వాపోతున్నారు. ప్రభుత్వం వ్యాధుల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

స్త్రీ శక్తి భవన నిర్మాణం పూర్తయ్యేనా?

భైంసా,అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : అధికార యంత్రాంగం అనుసరిస్తున్న అలసత్వ విధానాలు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యపు ధోరణి విధానాల మూలంగా వివిధ ప్రభుత్వ భవనాల నిర్మాణపు సంవత్సరాల తరబడి పూర్తి కావడం లేదు. వివిధ కారణాలతో అర్ధాంతరం నిలిచిన నిర్మాణపు పనులు ముందుకు సాగడం లేదు. ఫలితంగా సంబంధిత భవనాలకు సంబంధించిన వినియోగదారులు ఇబ్బం దులు పడుతున్నారు. భైంసా పట్టణ పరిధిలో ఇలాంటి కోవలోనే స్త్రీ శక్తి భవన నిర్మాణపు పనులు అర్ధాంతరంగా నిలిచిపోయి దశాబ్ద కాలం గడుస్తున్నప్పటికి పూర్తి చేయించే చర్యలను అధికారులు చేపట్టడం లేదు. పట్టణ పరిధిలోని పొదుపు సంఘాల కార్యాకలాపాల నిర్వహణ నిమిత్తం ప్రారంభించిన పట్టణ స్త్రీ శక్తి భవన నిర్మాణపు పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమీపంలో ఈ భవన నిర్మాణపు పనులను అప్పటి ముథోల్ ఎమ్మెల్యే డా.ఎస్.వేణుగోపాల చారి 2013 సంవత్సరం జూన్ 26న ప్రారంభించారు. ఎస్‌జేఎస్‌ఆర్‌వై నిధులు రూ.25లక్షలతో చేపట్టిన ఈ పనులు ప్రారంభమై పుష్కర కాలం దాటిన స్లాబ్ లెవల్ దశను వీడలేదు. భవన నిర్మాణపు ప్రారంభమవ్వడంతో తమ ఇబ్బందులు, అవస్థలు తొలగిపోతాయని సంబరపడ్డ పట్టణ పొదుపు సంఘాల సభ్యులు పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పట్టణ పరిధిలో మొత్తం 750 పొదుపు సంఘాలు ఉండగా ఇందులో దాదాపు 7500 మంది వరకు సభ్యులు ఉన్నారు. స్వంత భవనం లేకపోవడంతో పట్టణ పొదుపు సంఘాల నిర్వాహణ వ్యవస్థ మున్సిపల్ కార్యాలయంలోని రెండవ అంతస్తులో కొనసాగుతోంది. ఈ భవనంలో వసతుల లేమి,సౌకర్యాల కరువుతో సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. సమావేశాల నిర్వాహణలకు అవస్థలు పడుతున్నారు. తమ ఇబ్బందులు తొలగించేందుకు గాను కార్యాలయ భవన నిర్మాణపు పనులు త్వరితగతిన పూర్తయ్యేందుకు చర్యలు చేపట్టాలని పొదుపు సంఘాల శ్రేణులు కోరుతున్నాయి.


నిర్మాణ దశలోనున్న పట్టణ సమాఖ్య భవనం

అపరిశుభ్రం.. బాసర గోదావరి తీరం

● నిమజ్జనం తర్వాత చెత్తాచెదారం

బాసర, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బాసర వద్ద గోదావరి నదిలో శనివారం రోజున దుర్గామాత విగ్రహాల నిమజ్జనం పెద్ద ఎత్తున జరిగింది. నిర్మల్, నిజామాబాద్ జిల్లాలతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి పదుల సంఖ్యలో దేవతామూర్తులను భక్తులు బాసరకు తెచ్చి గోదావరిలో వదిలారు. అయితే, ఈ నిమజ్జన కార్యక్రమం తర్వాత నది తీరం అపరిశుభ్రంగా మారింది. విగ్రహాలను నిమజ్జనం చేయడంతో పాటు, దీక్ష చేపట్టిన భక్తులు తాము ధరించిన దీక్షా వస్త్రాలను కూడా స్నానం చేసిన చోటనే వదిలివేయడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఒక వైపు నిమజ్జనం చేసిన విగ్రహాలు మరోవైపు వదిలేసిన దీక్ష దుస్తులు, ఇంకోవైపు పూజా ద్రవ్యాలు... ఇలా నది తీరమంతా పారిశుధ్య లోపం తలెత్తింది. పేరుకుపోయిన చెత్తాచెదారంతో తీరం దుర్గంధంగా, అపరిశుభ్రంగా కనిపిస్తోంది.

● భక్తుల విన్నపం

గోదావరి నది తీరం అపరిశుభ్రంగా మారడంపై భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వేలాది మంది భక్తులు సరస్వతీ అమ్మవారి దర్శనం కోసం బాసరకు వస్తుంటారు. ఈ పారిశుధ్య లోపం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందని భక్తులు చెబుతున్నారు. నది తీరాన్ని తక్షణమే శుభ్రం చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు వెంటనే స్పందించాలని భక్తులు కోరుతున్నారు. లేదంటే ఈ చెత్తాచెదారం వల్ల పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగే ప్రమాదం ఉంది.


గోదావరి తీరంలో పరిస్థితి


స్నాన ఘట్టాల మీద పేరుకుపోయిన విగ్రహాలు, ఇతర వస్తువులు


గంగా హారతి ఇస్తున్న దృశ్యం.. పాల్గొన్న భక్తులు

చదువుల తల్లికి గంగా హారతి

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణంలో ఆర్యవైశ్య వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన శారదా దేవీ విగ్రహ నిమజ్జన శోభాయాత్ర కన్నులపండువగా సాగింది. భారీ ఎత్తున హాజరైన మహిళలు కోలాటాలు ఆడుతూ, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. శోభాయాత్ర గాంధీ చౌక్ వరకు చేరకున్న తర్వాత అమ్మవారికి గంగ హారతి అందించడం విశేషంగా ఆకట్టుకుంది. కాశీ నుంచి ప్రత్యేకంగా వచ్చిన వేద పండితులు కాశీలో జరిగే హారతి మాదిరిగా అమ్మవారికి హారతులు అందించారు. ఈ దృశ్యాలను చూసేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కాశీ లో గంగ హారతిని వీక్షించలేని భక్తులకు అక్కడి హారతి విశిష్టతను తెలియచేసేందుకు గాను కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

తాగునీటి కోసం తాండ్రవాసుల ఆందోళన

ఉట్నూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండ్ర గ్రామంలో మంచినీటి కోసం ప్రజలు శనివారం ధర్నా నిర్వహించారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడంతో వ్యవసాయ బావి నీటి ద్వారా ట్యాంకుకు నీరు చేర్చి అందుకుంటున్న ప్రజలకు స్థానికుడు ఒకరు మంచినీటి బావి వద్ద ఉన్న స్టార్టర్‌ను పగలగొట్టడంతో రెండు రోజులుగా మంచినీటి సమస్య ఏర్పడింది. దీంతో రెండు రోజుల నుంచి మంచినీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు తాండ్ర-బాబాపూర్ రహదారిపై ధర్నా నిర్వహించారు. సమాచారం అందుకున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్ తాండ్ర గ్రామానికి చేరుకుని మంచినీటి బావికి ఉన్న స్టార్టర్‌ను రిపేరు చేయిస్తామని మంచినీరు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ప్రజలు శాంతించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర రమేష్, సందీప్‌తో పాటు స్థానికులు పాల్గొన్నారు.


ఖాళీ బిందెలతో బాబాపూర్ రహదారిపై బైఠాయించిన ప్రజలు

స్థానిక సంస్థల ఎన్నికలకు అధికార యంత్రాంగం సమాయత్తం

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సంసిద్ధం అవుతోంది. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి విస్తృతం గా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే శనివారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన శిక్షణలో కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ తోపాటు పలువురు అధికారులు పాల్గొని దిశానిర్దేశం చేశారు. సాధరణ ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎఫ్ఎస్, ఎస్ఎస్‌టీ బృందాలు కీలకంగా వ్యవహరిస్తాయని తెలిపారు. ఈ బృందాలు నియమావళి ఉల్లంఘనలు, అవాంఛనీయ కార్యకలాపాలు, నగదు, మద్యం, బహుమతుల పంపిణీ వంటి అక్రమ చర్యలపై పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, ప్రజాస్వామ్య విలువలను రక్షించేలా బృందాలు చురుకుగా పని చేయాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రతీ బృందం తక్షణ స్పందనతో, నిర్దిష్ట సమాచారంపై చొరవగా స్పందించి, ఎన్నికల ప్రామాణికతను కాపాడాల్సిన బాధ్యత ఉందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు శ్యామలాదేవి, రాజేశ్వర్, ఆర్‌డీఎం స్రవంతి, తదితరులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

..కంట్రోల్ రూమ్ ప్రారంభం

ఆదిలాబాద్ టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో శనివారం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించారు. దీనిలో భాగంగా ఎన్నికల తీరును నిరంతరం పర్యవేక్షించడంతో పాటు ఎటువంటి లోటుపాట్లు జరగకుండా ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి పాల్గొన్నారు.


రిబ్బన్ కట్ చేసి కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

హైకోర్టు తీర్పుపై.. ఉత్కంఠ



- జిల్లాలో రిజర్వేషన్లు మారుతాయంటూ జోరుగా ప్రచారం
- వేచిచూసే ధోరణితో ఆశావహ నేతలు
- ప్రస్తుతం గాదిగూడ జడ్పీటీసీ స్థానంపై పలువురు నేతల కన్ను
- హైకోర్టు తీర్పు తర్వాతనే ఊపందుకోనున్న పల్లె రాజకీయం
- అంతా అనుకూలమైతే అక్టోబరు 9 నుంచి మొదటి విడత నామినేషన్లు

స్థానిక ఎన్నికల్లో .. బీసీలకు ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లను కల్పించింది. కొందరు హైకోర్టును ఆశ్రయించడంతో రిజర్వేషన్లపై మళ్లీ ఉత్కంఠ రేపుతోంది. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు తీర్పును వాయిదా వేయడంతో అక్టోబరు 8 హాట్ టాపిక్‌గా మారింది. ఎవరి నోట విన్నా.. ప్రస్తుతం అదే మాట వినిపిస్తోంది. ఎందుకంటే కోర్టు ఎలాంటి తీర్పును ఇస్తుందోనన్న ఉత్కంఠ కనిపిస్తోంది. మరో 3 రోజుల్లోనే రిజర్వేషన్లపై ఫైనల్‌గా స్పష్టత వచ్చే అవకాశం ఉందంటున్నారు.

..హాట్ టాపిక్‌గా అక్టోబరు 8

ఆదిలాబాద్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్, వార్డుమెంబర్ స్థానాల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ప్రత్యేక జీవోను విడుదల చేసిన విషయం తెలిసిందే. దీంతో జనరల్ స్థానాలు పూర్తిగా కనుమరుగై పోవడంతో ఆ వర్గాల్లో తీవ్ర అసంతృప్తి కనిపిస్తోంది. మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అక్టోబరు 9 నుంచి తొలివిడత ఎన్నికలకు నామినేషనను స్వీకరించేందుకు సన్నద్ధమవుతున్నారు. అయితే రాజకీయ వర్గాల్లో మాత్రం రిజర్వేషన్లపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆశావహ నేతలు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. అంతా కలిసి వస్తేనే మొదటి విడత నామినేషన్లు వేసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

ఆచితూచి అడుగులు

ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఆశావహ నేతలు ఎన్నికల బరిలో దిగేందుకు సిద్ధమవుతున్నారు. కానీ ఇప్పుడే తొందరపాటు వద్దన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. దీంతో నేతలంతా వేచిచూసే ధోరణితో కనిపిస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. అక్టోబరు 8 తర్వాతనే తమ రాజకీయ భవిష్యత్తుపై ఏదో ఒక నిర్ణయం ఉంటుందని చెబుతున్నారు. రిజర్వేషన్లు ఖరారై వారం రోజులు గడుస్తున్నా.. ఇప్పటి వరకు గ్రామాల్లో స్థానిక ఎన్నికల సందడి మొదలైనట్లు కనిపించడం లేదు. అక్టోబరు 8 తర్వాతనే అభ్యర్థుల నిర్ణయం ప్రకటించే అవకాశం కనిపిస్తుంది. తొందరపడి హడావెడి చేస్తే రిజర్వేషన్‌ల మార్పుతో ఇబ్బంది పడాల్సి వస్తుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా బీసీ రిజర్వేషన్ల మార్పు ఉంటుందన్న టాక్ ఎక్కువగా వినిపిస్తోంది.

అందరి దృష్టి గాదిగూడ వైపే..

జడ్పీ చైర్మన్ కావాలని భావించిన నేతలందరికి రిజర్వేషన్ కలిసి రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ముఖ్యంగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలు గాదిగూడ మండలం నుంచి పోటీ చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నా రు. జిల్లాలో 20 జడ్పీటీసీ స్థానాలకు గాను ఎస్టీ 8, బీసీ 8, ఎస్సీ 2, జనరల్ స్థానాలు 02 ఉన్నాయి. అయితే జడ్పీ చైర్మన్ పదవిని జనరల్ మహిళకు కేటాయించడంతో గాదిగూడ మండల జడ్పీటీసీ స్థానంపై పలువురు నేతలు కన్నేస్తున్నా రు. ముఖ్యంగా అధికార పార్టీ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నేతలు గాదిగూడ జనరల్ స్థానం నుంచి గెలిచేందుకు మంతనాలు జరుపుతున్నారు. అలాగే ఇంద్రవెల్లి జడ్పీటీసీ స్థానం జనరల్ మహిళ కావడంతో ఇక్కడ కూడా తీవ్రమైన పోటీ ఉండే అవకాశం కనిపిస్తుంది. పలువురు స్థానిక నేతలు ఈ స్థానం కోసం పోటీ పడుతుండగా.. ఇతర మండలాలకు చెందిన నేతలు కూడా పోటీ చేసేందుకు పావులు కదుపుతున్నారు. అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇస్తే

(తరువాయి 6వ పేజీలో....)


బేల మహా హారతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల

మహాకాళీ ఆలయంలో ప్రత్యేక పూజలు

జైనథ్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాతో పాటు నియోజకవర్గ ప్రజలు పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శరన్నవరాత్రి ముగింపు ఉత్సవాల్లో భాగంగా శనివారం బేల మండల కేంద్రంలోని మహాకాళీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున మహిళలతో నిర్వహించిన మహా హారతి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బేల గ్రామ ప్రజలు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): దసరా, దేవీ నవరాత్రులను శాంతియుత వాతావరణంలో నిర్వహించి, ఎటువంటి ఆటంకాలు కలగకుండా తనదైన ముద్ర వేసిన ఎస్పీ అఖిల్ మహాజన్‌కు సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వేడుకలు సాఫీగా సాగేందుకు పోలీసు యంత్రాంగం కృషి చేయడం పట్ల అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సమితి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రమోద్ కుమార్ ఖత్రి, పడకంటి సూర్యకాంత్, కోశాధికారి రేణుకుంట రవీందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కందుల రవీందర్, లోలపు శ్రీనివాస్, బానోత్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'అందరూ బీజేపీ వైపు చూస్తున్నారు'

ఉట్నూర్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారని, అధికార పార్టీ కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్‌లపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చినందున స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం దిశగా ప్రతికార్యకర్త ముందుకు సాగాలని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్‌రాథోడ్ అన్నారు. మండల కేంద్రంలోని రితేష్ నివాసంలో శనివారం నిర్వహించిన బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మోదీ సర్కారు తెలంగాణలోని ప్రతీ పల్లెకు నిధులు ఇచ్చి ప్రతీ అభివృద్ధి కార్యక్రమానికి అండగా నిలిచారని వివరించారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించే దిశగా పయనించాలన్నారు. బీజేపీని గెలిపించుకోవడానికి ప్రజలు ఉత్సాహం చూపిస్తున్నారన్నారు. ఇందులో మండల అధ్యక్షుడు వెంకటేశ్, ఖానాపూర్ నియోజకవర్గ కో కన్వీనర్ ఆరెల్లి రాజలింగం, సీనియర్ నాయకులు శ్రీరామ్‌నాయక్, జడ్పీటీసీ కన్వీనర్ సాడిగే రాజేశ్వర్, మాజీ వైస్ ఎంపీపీ దావులే బాలాజి, మాజీ ఎంపీటీసీ సీపతిలింగాగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి కాల్వరవి, సాల్గర్ రవీందర్, సీనియర్ నాయకులు కొమ్మురామచందర్, ఉష్కముల దేవిదాస్, సంజీవ్‌పటేల్, అర్జున్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలపై అమ్మవారి కృపా కటాక్షాలు'

మావల, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): అమ్మవారి కృప కటాక్షలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. శారదా దేవీ నవరాత్రుల సందర్భంగా శనివారం మావలలో నవశక్తి శారదాదేవి మండల్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన శారదాదేవి మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు మండపం నిర్వాహకులు శ్రీకాంత్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం దేవి విగ్రహాన్ని డీజే చప్పుల్లా నడుమ ఘనంగా నిమజ్జన ఊరేగింపు శోభా యాత్రలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు అప్సర్ ఖాన్, అబ్దుల్ ,దేవి మండల అధ్యక్షులు మెట్టు భూమన్న, కాడే భూమన్న, రాజేశ్వర్, గంగయ్య, రమాకాంత్, మోహన్, హరీష్, లక్ష్మణ్, వంశీక్రిష్ణ, మోహన్, దినేష్, తదితరులు ఉన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగ

- కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్
- తాంసి, తలమడుగులో ఘనంగా వేడుకలు
- ఆదిలాబాద్‌లోనూ అంబరాన్నంటిన సంబురాలు


కప్పర్లలో బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్, ఎస్పీ


ఆదిలాబాద్‌లో బతుకమ్మలతో వస్తున్న మహిళలు, యువతులు

7వ పేజీలో...

సాంగ్వీలో పంటలను పరిశీలించిన కలెక్టర్

జైనథ్, అక్టోబరు4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాంగ్వి గ్రామంలో శనివారం కలెక్టర్ రాజార్షిషా ఆకస్మికంగా వెళ్లి రైతులు వేసిన పత్తి, సోయా పంటలను పరిశీలించారు. ప్రస్థుతం వర్షం పడుతున్న నేపథ్యంలో పంటల పరిస్థితిని రైతులను అడిగి తెలుసుకున్నారు. వేస్తున్న పంటలు వాటి దిగుబడులు పంట రక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వ్యవసాయాధికారులను అడిగి తెలుసుకున్నారు. పత్తి పంటలో వచ్చే గులాబీ రంగు పురుగు నివారణకు రైతులను ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని వ్యవసాయాధికారులకు సూచించారు. పంటలపై పలు అంశాల పై రైతులు వ్యవసాధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్‌స్వామి, టెక్నికల్ ఏఓ శివకుమార్, జైనథ్ మండల వ్యవసాయ శాఖ అధికారి పూజ, ఏరువాక శాస్త్రవేత్తలు రాజు, శేఖర్, శ్రీధర్, తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరి, ఎంపీడీవో వేణు, ఎంపీవో వాణి, సాంగ్వి ఏఈఓ సుజాతలతో పాటు రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.


సాంగ్విలో వ్యవసాయాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజార్షిషా


ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రిలో మెడికల్ షాపులో రిజిస్టర్‌లను పరిశీలిస్తూ..

రిమ్స్‌లో ఆకస్మిక తనిఖీలు

ఆదిలాబాద్ టౌన్: నవజాత శిశు మరణాలు సంభవించకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం రిమ్స్ ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిమ్స్ ప్రసవ కేంద్రాలు, ఎస్ఎన్సీయూ, మదర్ కేర్, పోస్టు డెలివరి, ఏఎన్సీ, పీఎన్సీ వార్డులను పరిశీలించి రోగుల వివరాలను తెలుసుకున్నారు. రిజిస్టర్ పరిశీలించి వారికి అందిస్తున్న చికిత్సలు, సమస్యల గురించి ఆరా తీశారు. రోగులకు ఇబ్బందులు లేకుండా నాణ్యమైన చికిత్సలు అందించాలని సూచించారు. అక్కడి నుంచి రిమ్స్ ఆవరణలో ఉన్న మందుల దుకాణాలను తనిఖీ చేశారు. మందుల వివరాలు, రిజిష్టర్ తదితర వాటిని పరిశీలించారు. ఓ మెడికల్ షాపులో పక్కా బిల్లు ఇవ్వకపోవడం పట్ల అభ్యంతరం తెలిపి జీఎస్టీ పక్క బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. అదే విధంగా రిమ్స్ ఆవరణలో విజయడెయిరీ అవుట్ లేట్‌లో ఇతర వస్తువులు విక్రయించడాన్ని చూసిన కలెక్టర్ వాటిని తొలగించాలని ఆదేశించారు. ఆయనతో పాటు డీఎంహెచ్‌ం డాక్టర్ నరేందర్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డిప్యూటీ డీఎంహెచ్ సాధన, ఎస్ఎన్సీయూ హెచ్‌వోడీ డాక్టర్ అనంతరావు, వైద్యులు పాల్గొన్నారు.

వేస్ట్ టు వండర్ ప్రదర్శన ప్రారంభం

ఆదిలాబాద్ టౌన్: వ్యర్థాలను అద్భుతాలుగా మారుస్తూ మున్సిపల్ సిబ్బంది సృజనాత్మకతతో తయారు చేసిన వేస్ట్ టు వండర్ ప్రదర్శనను కలెక్టర్ రాజర్షి షా స్థానిక గాంధీ పార్క్‌లో ప్రారంభించారు. అంతేకాకుండా ట్రైనీ కలెక్టర్ సలోని పర్యవేక్షణలో పుర యంత్రాంగం వీటిని రూపొందించారు.